

# రాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు

- అహంకారమే కేసీఆర్‌ను ఓడించింది
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



హుస్నాబాద్, జనవరి 10 : రాముడి పేరు మీద బీజేపీ రాజకీయాలు చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. రాముడు మంచివాడని, అందరికీ ఆదర్శప్రాయుడని, కానీ రాముడికి రాజకీయాలు రుద్దడాన్ని సీపీఐ ఖండిస్తున్నదని తెలిపారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన బిల్కిస్ బానో కేసు తీర్పు కేంద్రంలోని బీజేపీకి చెంపపెట్టు లాంటిదన్నారు. తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పౌరహక్కులను కాలరాసిందని ఆయన ఆరోపించారు. అహంకారపు విధానాలే కేసీఆర్‌ను ఓడించాయన్నారు. గత ప్రభుత్వ దుర్వినియోగాలపై జ్యుడీషియల్ విచారణ జరిపించడం సరైందేనన్నారు. ప్రజల్లో ఉంటూ వారి ఆకాంక్షలు నెరవేర్చే విధంగా ముందుకు సాగాలని ప్రస్తుత ప్రభుత్వానికి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో కలిసి నడువాలని కోరుకుంటున్నామని చాడ స్పష్టం చేశారు. సీపీఐకి ఎమ్మెల్సీ ఇచ్చే విషయంపై చర్చ జరుగుతుందని వెల్లడించారు. గౌరవెల్లి రిజర్వాయర్ విషయంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి అన్ని విషయాలు వివరిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, కొయ్యడ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# పూర్తి పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి

- రైల్వేలైన్ పనులను అడ్డుకొని నిరసన తెలిపిన రైతులు



మాచాపూర్ శివారులో రైల్వేలైన్ పనులను అడ్డుకుని నిరసన తెలుపుతున్న రైతులు

చిన్నకోడూరు, జనవరి 10 : పూర్తిస్థాయిలో నష్ట పరిహారం చెల్లించాకే రైల్వేలైన్ నిర్మాణ పనులను చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. చిన్నకోడూరు మండలం మాచాపూర్ శివారులో రైల్వేలైన్ నిర్మాణ పనులను బుధవారం రైతులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వేలైన్‌లో భాగంగా 2017లో గ్రామానికి చెందిన సుమారు 100 మంది రైతుల నుంచి 50 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు సేకరించారని తెలిపారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆ భూమిలో సాగు చేసిన పంటలను, మామిడి చెట్లను తొలగించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి చెట్లకు తగిన నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వేసిన పంటలకు నష్ట పరిహారం చెల్లించి, అలైన్‌మెంట్ ప్రకారమే పనులు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# పత్తి రైతు దిగాలు



## దిగుబడి రాలేదు.. ధర లేదు | పెట్టుబడి తిరిగిరావడం కష్టమే!

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 10: జిల్లాలో పత్తి రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 1.09 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. విత్తనం కొనుగోలు నుంచి ఎరువుల బస్తాలపై, మందులు, కలుపుతీత, గొర్రు, గుంటుక తోలడం, పత్తి ఏరడం లాంటి పనులతో ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేల పైగానే ఖర్చు చేశారు. తీరా చూస్తే లాభాల మాట దేవుడెరుగు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితులు కనబడటం లేదని వాపోతున్నారు.

### అనుకూలించని వాతావరణం

ఈసారి వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి దిగుబడి పూర్తిగా తగ్గింది. జిల్లాలోని పత్తి రైతులు ఎక్కువగా వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల బెడద, పూత, కాత సమయంలో వర్షాలు కురవకపోవడంతో ఆశించినస్థాయిలో పంట దిగుబడి రాలేదు. ఎకరాకు 7 నుంచి 12 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చేది. ఈసారి 5 క్వింటాళ్లలోపే వస్తోందని రైతులు చెబుతున్నారు. మరోవైపు కూలీల ఖర్చు కూడా అమాంతంగా పెరిగింది. కూలీ రూ.300 నుంచి రూ.400 వరకు డిమాండ్ చేస్తున్నారు.

### ఆశించిన ధర లేక నిరాశ

పత్తి రైతుకు ఆశించిన ధర లేక తెల్లబోతున్నాడు. గత సంవత్సరం సీసీఐ మద్దతు ధర రూ.6920 ఉండగా ప్రైవేట్‌లో పత్తి నాణ్యతను బట్టి రూ.9 వేల నుంచి 10 వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది కూడా సీసీఐ మద్దతు అంతే ఉండగా ప్రైవేట్‌లో రూ.6200 నుంచి రూ.6400 వరకే పలుకుతుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. రైతులకు డబ్బు అత్యవసరమై సీసీఐ కేంద్రాలకు వెళ్లలేక ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కాటన్ ధరలు, పత్తి గింజల ధరలు, పత్తి నూనెల ధరల పైనే పత్తి రేటు ఆధారపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

### పత్తికి బోనస్ ప్రకటించాలి



మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. దుక్కి దున్నకం నుంచి విత్తనం, ఎరువులు, మందులు ఇతర పనుల కోసం రూ.80 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. ఎకరానికి కేవలం నాలుగు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. మరోవైపు ధర కూడా సరిగా లేదు. ప్రభుత్వం స్పందించి పత్తికి బోనస్ ప్రకటించి రైతులకు అందించాలి.

- బట్ట లక్ష్మయ్య రైతు, మగ్దుంపూర్

# చరిత్ర లేకపోతే భవిష్యత్తు అంధకారం

- 1988లో తుపాకీ కోసం హుస్నాబాద్‌కు వచ్చా.. అప్పుడు పడితే ఎట్లుండునో
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 10 : చరిత్ర అనేది లేకపోతే భవిష్యత్తు అంధకారమే అవుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చరిత్రను మరచిపోకుండా భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం డివిజన్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ జర్నలిస్టు మంగ శారపు లక్ష్మన్ రాసిన మాయని గాయాల నెత్తుటి చరిత్ర (యదార్థ సంఘటనల సమాహారం) పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ ప్రాంతం ఉద్యమాలకు పుట్టినిల్లు అని, భూమి, భుక్తి, విముక్తి కోసం, జమీందారి, జాగిర్దార్లకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో ఎంతో మంది త్యాగాలు చేశారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నక్సలైట్ ఉద్యమాలు, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. విద్యార్థి నాయకుడిగా తనపై హత్యాయత్నం చేశారని గుర్తు చేశారు. 1988లో తుపాకీ పట్టాలనే ఆలోచనతో హుస్నాబాద్‌కు వచ్చానని, కానీ అప్పుడు అది దొరికితే ఎట్లుండునో అని అభిప్రాయపడ్డారు. హుస్నాబాద్ ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యే అయ్యాయని, ఇక్కడి ప్రజలకు ఎర్రతివాచీ పరుస్తానని తెలిపారు. తన గురువు చొక్కారావు రవాణా శాఖ మంత్రి అయ్యారని, 50 ఏళ్లకు శిష్యుడిగా తాను ఆ శాఖ మంత్రిని అయ్యానని వెల్లడించారు. సర్వాయి పాపన్న లాంటి పోరాట వీరుల చరిత్రను తెలిపేందుకు ఇక్కడ ఒక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాశ్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కవి, రచయితలు వెల్దండి శ్రీధర్, అన్నవరం దేవేందర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పిట్టల తిరుపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

# చేర్యాలలో నోటీసుల గుబులు

- ప్రధాన రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్లలోపు గృహ, భవన యజమానులకు జారీ

చేర్యాల, జనవరి 10 : సూర్యాపేట-సిరిసిల్ల జాతీయ రహదారిలో భాగంగా జనగామ-సిద్దిపేట రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. చేర్యాల పట్టణ శివారు వరకు బీటీ పనులు పూర్తి కావచ్చాయి. మొత్తంగా రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల ప్రామాణికతతో జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. చేర్యాల పట్టణంలో డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. డ్రైనేజీ నిర్మాణానంతరం విద్యుత్ స్తంభాలు, తాగునీటి సరఫరా పైపులైన్, చెట్ల పెంపకం కోసం ఐదు ఫీట్ల స్థలాన్ని కేటాయించనున్నారు.

ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఇటీవల పట్టణ ప్రధాన రహదారికి 50 ఫీట్లలోపు గల ఇళ్లు, భవనాల యజమానులకు నోటీసులను జారీ చేశారు. నిర్ణీత ప్రదేశంలోపు ఇళ్లు లేదా భవనం ఉన్నందున డాక్యుమెంట్, నిర్మాణ అనుమతి పత్రాన్ని అందజేస్తూ వారంలోగా సంజాయిషీ ఇవ్వాలని సూచించారు. దీంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. జాతీయరహదారి కావడంతో ఎలాంటి నష్టపరిహారం అందించరని చెబుతున్నందున ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి సంజాయిషీ ఇవ్వని యెడల తామే కొలతల ప్రకారం కూల్చివేయించి స్థలాన్ని సేకరించి నేషనల్ హైవే అథారిటీకి అప్పగించనున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. పలువురికి ఇచ్చిన గడువు కూడా పూర్తికావడంతో ఏం చేయాలో పాలుపోక తలలుపట్టుకుంటున్నారు.

### 75 మందికి జారీ

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్లలోపు నిర్మాణాలు గల 75 మంది ఇళ్లు, భవన యజమానులకు నోటీసులను జారీ చేశాం. స్థల యాజమాన్య డాక్యుమెంట్‌తో పాటు గృహ నిర్మాణం అనుమతిపత్రాన్ని సమర్పించాలని సూచించాం. పలువురు ఇష్టానుసారంగా మున్సిపల్ రోడ్డు ఆక్రమించి రేకులషెడ్లు వేశారు. గడువులోగా ఎలాంటి సంజాయిషీ ఇవ్వకపోయినా, పత్రాలు అందించకపోయినా మార్కింగ్ ప్రకారం స్థలం సేకరించి ఎన్‌హెచ్ అధికారులకు కేటాయిస్తాం. ఆక్రమణలు తొలగిస్తాం.

-రాజేంద్రకుమార్, కమిషనర్



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు



సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు



ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

# ముగ్గుల హరివిల్లు

## ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్



ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని



ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినీనటి అనన్య






ముగ్గులు వేస్తున్న మహిళలు





అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ




















## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి


మృతిచెందిన యువకులు


వంశీ(ఫైల్)


లోకేష్(ఫైల్)

సిద్దిపేటరూరల్, జనవరి 10: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లి గ్రామానికి చెందిన నల్ల లోకేష్(16), పిండం వంశీ(16) పుట్టినరోజు కోసం కేక్ తీసుకొని సిద్దిపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన కుందాల బాలకృష్ణ(22) వారి బంధువులైన సిద్దిపేట రూరల్ మండలం పెద్ద లింగారెడ్డిపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రాఘవాపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి వీరి బైకులు అతివేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో లోకేష్, వంశీలు అక్కడికక్కడే మృతిచెందగా బాలకృష్ణ పొదల్లో పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న బాలకృష్ణను 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిద్దిపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హత్య కేసును ఛేదించిన పోలీసులు


బ్రిజేష్ గోస్వామి(ఫైల్)

జిన్నారం, జనవరి 10: నాలుగు నెలల క్రితం అదృశ్యమైన వ్యక్తి హత్యకు గురికాగా బొల్లారం పోలీసులు కేసును ఛేదించారు. బొల్లారం సీఐ నయిమోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బ్రిజేష్ గోస్వామి(26) ఉపాధి నిమిత్తం బొల్లారం వచ్చి పోచమ్మ బస్తీలో కుటుంబంతో నివాసముంటున్నాడు. కాగా 2023 ఆగస్టు 8న గోస్వామి అదృశ్యం కాగా.. భార్య ఆర్తిదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులైన రాజన్, అజయ్, సీతు, విజయ్ అదుపులోకి తీసుకుని విచారించగా.. బ్రిజేష్‌ను హత్య చేసి కాజీపల్లి సమీపంలోని రోడ్డు కల్వర్టు కింద పారవేశారని తేలింది. బుధవారం ఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని సీఐ తెలిపారు. స్థలాన్ని ఎస్పీ రూపేష్, డీఎస్పీ పురుషోత్తమ్‌లు పరిశీలించారు.

## బెల్ట్‌షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై పోలీసుల దాడులు

సంగారెడ్డి క్రైం, జనవరి 10: పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం ఇంజనీరింగ్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నడుపుతున్న బెల్ట్‌షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్‌షాప్‌లు నడుపుతూ అక్రమంగా మద్యం అమ్ముతున్నారని, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఏర్పాటు చేసి వాటిలో ప్రభుత్వం నిషేధించిన సిగరెట్లను అమ్ముతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ చెప్పారు.

## 'యువత అన్నిరంగాల్లో ముందుండాలి'

సంగారెడ్డి అర్బన్, జనవరి 10: యువత అన్నిరంగాల్లో ముందుండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం నేషనల్ యూత్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యువత సమస్యలను అధిగమించి లక్ష్యాన్ని ఛేదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అశోక్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, డీవైఎస్‌వో రాంచందర్‌రావు, తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పాల్గొన్నారు.

## పెద్దశంకరంపేట శివారులోని రెస్టారెంట్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి


రెస్టారెంట్‌లో టీ తాగుతున్న మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్‌షిండే

పెద్దశంకరంపేట, జనవరి 10: మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి పెద్దశంకరంపేట శివారులోని రెస్టారెంట్‌లో ఆగి టీ సేవించాడు. హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో హైవే 161పై పెద్దశంకరంపేటలోని కింగ్స్-9 రెస్టారెంట్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే టీ తాగడం కోసం ఆగారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు యువకులు పోటీపడ్డారు. రెస్టారెంట్‌లో ఆయన 15 నిమిషాలు గడిపారు. అల్లాదుర్గం సీఐ జార్జ్, పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.



## మట్టిలో అనేక మాణిక్యాలు ఉంటాయి

- వాటిని వెతికిపట్టడంలోనే సమాజం విఫలం
- కవి, రచయిత జయరాజు



గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కవి, రచయిత జయరాజు

గజ్వేల్, జనవరి 10: మట్టిలో అనేక మాణిక్యాలు ఉంటాయని వాటిని వెతికిపట్టడంలో సమాజం విఫలమైందని కవి, రచయిత జయరాజు అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గజ్వేల్ జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ, ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఖాజా విరాహత్‌అలీకి ఆత్మీయ సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయాల్లో సంఘసంస్కర్తలకు, అక్షరానికి, తెలివికి అవకాశం లేదన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పరిపూర్ణంగా అమలులోకి రాలేదని, అభివృద్ధితో పాటు అనేక విషయాల్లో వెనుకబడి ఉన్నదని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో అనేక మాణిక్యాలు ఉంటాయని, వాటిని వెతికి పట్టడంలోనే సమాజం విఫలమవుతుందన్నారు. అక్షరాల్లో పెరిగిన వ్యక్తి విరాహత్‌అలీ అని, నిత్యం సేవ చేయడంలోనే ఆయన ఆనందాన్ని, సంతృప్తిని పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కవి, రచయితలు దరువు అంజన్న, షేక్‌బాబ, జడ్పీటీసీ పంగ మల్లేశం, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాంచంద్రం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధరశర్మ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీఅహ్మద్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయండి: కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 10: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాన్ని పూర్తి చేయాలని రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లు, అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి బియ్యం నిల్వలు అందించేలా రైస్ మిల్లర్లు సహకరించాలని, రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను 25 వరకు అందించాలని ఆదేశించారు. సీఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యాన్ని చేసుకోని మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, నిర్ణీత సమయంలోగా అందజేయని వారిపై 6ఏ కింద కేసులు నమోదు చేసి, మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా సీజ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. 2022-23 ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్ 10 రోజుల్లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓటరు జాబితా సవరణలో 2024లో భాగంగా తప్పులు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలని ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా 22 వరకు క్లైమ్స్, అబ్జెక్షన్స్ స్వీకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్పించాలన్నారు. ముఖ్యంగా ఫారం 7, 8ల పరిశీలన పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ నిర్వహిస్తున్నామని, ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నీటి వనరుల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుని వాటిని కాపాడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జహీరాబాద్ ట్రైడెంట్ చక్కెర కర్మాగారం రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో నగేష్‌గౌడ్, పౌరసరఫరాల జిల్లా అధికారి వనజాత, పౌర సరఫరాల శాఖ డీఎం సుగుణబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైస్ మిల్లర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

## విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

కంది, జనవరి 10: కేజీబీవీ విద్యార్థినులు గృహహింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో, వరకట్న నిషేధం తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. కంది మండల పరిధిలోని కాశీపూర్ వద్దనున్న కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం)లో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు ఆదేశాలతో హనుమంతరావు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. బాలికలు ఎవరిపై ఆధారపడకుండా పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేటట్లు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సదస్సులో కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరుల పాల్గొన్నారు.




కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

## సంక్రాంతికి ఊరు వెళ్తున్నారా.. జాగ్రత్త!

- కొత్తవారి కదలికలపై సమాచారం అందించాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డా.బాలస్వామి

మెదక్ అర్బన్, జనవరి 10: సంక్రాతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు వెళ్లే ఆయా కాలనీ, అపార్టుమెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డా.బాలస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. సొంత గ్రామాలకు వెళ్లే వారు ఇళ్లల్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బులు ఉంచవద్దన్నారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో గానీ, లాకర్లు లేని వారు వాటిని తమ బంధువుల ఇళ్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ ఊరికి ప్రయాణం కట్టిన పరిస్థితుల్లో తెలిసిన వారిని తమ ఇళ్లల్లో రాత్రివేళ పడుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబరును సంబంధిత పోలీస్‌స్టేషన్లలో తెలపాలని పేర్కొన్నారు. ప్రజలు తమ కాలనీలు, ఇళ్ల పరిసరాలు, షాపింగ్ మాళ్లలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని చెప్పారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 8712657888 సమాచారం ఇవ్వాలన్నారు.



ఎస్పీ డా.బాలస్వామి

## ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలను సాధించాలి: మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, జనవరి 10: ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంటర్ కళాశాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయని, జిల్లాలో ఉన్న 63 కళాశాల విద్యార్థులను ఏబీసీడీ గ్రూపులుగా విభజించి, సీడీ గ్రూప్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఈ నెల 1 నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, స్పెషల్ స్లిప్ టెస్టులు, నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రథమ 6,506 మంది, ద్వితీయ సంవత్సరంలో 6,653 మంది మొత్తం 13,159 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. అనంతరం సబ్జెక్టు కౌన్సిలర్స్ తయారు చేసిన ప్రత్యేక బేసిక్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ, ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి విజయలక్ష్మి, ప్రిన్సిపల్స్, కౌన్సిలర్స్ అవనీశ్‌రెడ్డి, శశిధర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీదేవి, కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

## కలలు కనాలి.. వాటిని సాకారం చేసుకోవాలి

- చదువులో క్రమశిక్షణ అవసరం
- విద్యార్థులు ఎక్కడా వెనక్కి తగ్గొద్దు
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి అర్బన్, జనవరి 10: విద్యార్థులు కలలు కనాలి.. వాటిని సాకారం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో మూడురోజుల పాటు నిర్వహించిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ విద్యార్థులు నిద్రపోయే కలలు కనవద్దని, నిద్ర పోనివ్వకుండా చేసే కలలు కనాలన్నారు. విద్యార్థులు తనకు తాను నమ్మకంగా ఉండాలని, నమ్మకం లేకపోతే ఏమీ చేయలేమన్నారు. మనలో ఎంత శక్తి ఉందో అది మనకే తెలుసని పేర్కొన్నారు. చదువులో క్రమశిక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థులు ఎక్కడా వెనక్కి తగ్గకుండా అన్నిరంగాల్లో రాణించాలన్నారు. తాను 15 ఏళ్ల కిందటే రూపేష్ ఐఏఎస్ అని తన డైరీలో రాసుకున్నానని, చివరికి ఐపీఎస్ అయ్యానని చెప్పారు. అందుకే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒక చిన్న ఐడియా జీవితాన్ని మార్చేస్తుందని, అందులో ప్రతి ఒక్కరూ ఐడియాలజీని అలవర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్లే విద్యార్థులు ఈ ప్రదర్శనకు వచ్చారని ఉపాధ్యాయులను మర్చిపోవద్దని సూచించారు. అనంతరం జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 782 ఎగ్జిబిట్లు ప్రదర్శించగా, అందులో చివరగా ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాల నుంచి ఒక్కోటి చొప్పున 11 ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన ఎగ్జిబిట్ విద్యార్థి, గైడ్ టీచర్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఏడీ శంకర్, జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, మీడియా కన్వీనర్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన ఎగ్జిబిట్ విద్యార్థులతో ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్


## గంజాయి మొక్కలు ధ్వంసం



ధ్వంసం చేసిన గంజాయి మొక్కలు

కోహెడ, జనవరి 10: కోహెడ మండలంలో గంజాయి మొక్కలు పెంచుతున్న ఇంటిపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడిచేసి ధ్వంసం చేశారు. హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కోహెడ మండలం ఆరెపల్లి గ్రామపంచాయతీ చంద్రనాయక్‌తండాలో బానోత్ కోమలి ఇంటి ఆవరణలో 26 గంజాయి మొక్కలు పెంచారు. పక్కా సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐలు, సిబ్బంది సంయుక్తంగా కోమలి ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఇంటి ఆవరణలో 26 గంజాయి మొక్కలతో పాటు ఇంటి ముందు 240 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో కోమలితో పాటు మనుమడు బానోత్ గణేష్‌పై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని తెలిపారు. తఇందులో సీఐలు కే.శ్రీధర్, పవన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు పురుగు పట్టిన పప్పు



పురుగు పట్టిన కందిపప్పు ప్యాకెట్

జగదేవ్‌పూర్, జనవరి 10: గజ్వేల్ సెక్టార్ పరిధిలోని వర్గల్, జగదేవ్‌పూర్, ములుగు, గజ్వేల్, మర్కుక్ మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతినెల పప్పును, పాలను సరఫరా చేస్తున్నారు. గతంలో ప్రభుత్వమే అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు, పాలు పంపిణీ చేసేది. కానీ కొన్నినెలల నుంచి కాంట్రాక్టర్ పంపిణీ చేస్తున్నారు. రెండు నెలల క్రితం సదరు కాంట్రాక్టర్ పురుగులు పట్టిన కిలో కంది పప్పు ప్యాకెట్లు సరఫరా చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు ఆ పప్పు బాగాలేదని, తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పురుగులు పట్టిన పప్పును పక్కన పెట్టి పాత స్టాక్ ఉన్న పప్పునే వండుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా పురుగులు పట్టిన పప్పును కాంట్రాక్టర్ తీసుకెళ్లకపోవడంతో కేంద్రాల్లోనే నిల్వ ఉంటుందన్నారు. అధికారులు స్పందించి శుభ్రమైన కందిపప్పును సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## కల్లుగీత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయండి

సంగారెడ్డి రూరల్, జనవరి 10: ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న కల్లుగీత కార్మికులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలో కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. జిల్లాలో 50 ఏళ్లకు పైబడిన అనేకమంది కల్లుగీత కార్మికులు పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వారికి ఎక్సైజ్ అధికారులు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో వారి దరఖాస్తులను తిరస్కరించే అవకాశం ఉన్నదని తెలిపారు. జిల్లా ఎక్సైజ్‌శాఖ నుంచి గీత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని, అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కేజీకేఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

## డీఎల్‌డీఏ ఉమ్మడి జిల్లా ఈవోగా రాంజీ



డీఎల్‌డీఏ ఉమ్మడి జిల్లా ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రాంజీని సన్మానిస్తున్న గోపాలమిత్రలు

మెదక్ అర్బన్, జనవరి 10: జిల్లా పశుగణాభివృద్ధి సంఘం(డీఎల్‌డీఏ)గా డాక్టర్ రాంజీ బుధవారం జిల్లా కేంద్రంలోని ఉమ్మడి జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈవోగా పనిచేసిన డా.కొండల్‌రెడ్డి సిద్దిపేట జిల్లా జేడీ కార్యాలయ వెటర్నరీ ఏడీగా బదిలీ అయ్యారు. ఆరునెలల కింద డా.రాంజీ ఆదిలాబాద్ జిల్లాకు సాధారణ బదిలీపై వెళ్లగా.. తిరిగి మెదక్ ఉమ్మడి జిల్లా డీఎల్‌డీఏ ఈవోగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంపద పెంపు కోసం గోపాలమిత్రలు కృషి చేయాలన్నారు. మేలు జాతి పశువుల ఉత్పత్తికి.. కృత్రిమ గర్భధారణ ఎంతో దోహదపడుతుందన్నారు. పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అనంతరం రాంజీని గోపాలమిత్రలు శాలువాతో సన్మానించారు.

## యువజన ఉత్సవాలకు సిద్దిపేట విద్యార్థి



డేవిడ్‌ను సత్కరిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్‌రావు

సిద్దిపేట క్రైం, జనవరి 10: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 12 నుంచి 16 వరకు జరిగే యువజన ఉత్సవాలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-1 నుంచి బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి డేవిడ్ ఎంపికయ్యాడు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ ఉత్సవాలకు డేవిడ్ ఎంపిక కావడం సంతోషమని ప్రిన్సిపాల్ సీహెచ్.ప్రసాద్ తెలిపారు. డేవిడ్‌ను పుష్పగుచ్ఛంతో సత్కరించి, అభినందించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి నలుగురు ఎంపిక కాగా.. అందులో డేవిడ్ ఉండడం విశేషమన్నారు. కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సీహెచ్.మధుసూదన్, డాక్టర్ పల్లవి, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రద్ధానందం, డాక్టర్ రాణి, కృష్ణయ్య పాల్గొన్నారు.

## వైభవంగా మూల మహోత్సవం

వర్గల్, జనవరి 10: వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూల మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. విద్యా సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం విద్యా సరస్వతీ అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం విద్యాసరస్వతీ అమ్మవారికి లక్ష పుష్పార్చన, యాగశాలలో చండీహోమం నిర్వహించారు. విద్యా సరస్వతీ అమ్మవారితో పాటు క్షేత్రంలోని ఉప ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

# అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- ప్రజల సమస్యలు తెలుసుకోవాలి
- నియోజకవర్గ అభివృద్ధే ప్రాధాన్యం
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్


హుస్నాబాద్ ఆర్టీసీ డిపో కొత్త బస్సును ప్రారంభించి అందులో ప్రయాణం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 10: అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే మొదటి ప్రాధాన్యత అని చెప్పారు. అధికారుల స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలతో అధికారులు మర్యాదపూర్వకంగా ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గం మూడు జిల్లాలతో కూడి ఉన్నదని అభివృద్ధికి అందరూ కలిసి మెలిసి పనిచేయాలని పేర్కొన్నారు. మంజూరైన పనులు, వాటిలో ఇప్పటికీ ప్రారంభం కాని, ప్రారంభమై వివిధ స్థాయిలో ఉన్న పనుల వివరాలను తెలపాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 కోట్లను కేటాయించిందని వెల్లడించారు. వివిధ గ్రామాలను కలిపే రోడ్లు, హైలెవెల్ బ్రిడ్జిలు, బీటీ రోడ్ రెన్యూవల్, విద్యుత్ అవసరాలు, తదితర అన్ని వివరాలను సేకరించాలన్నారు. విద్యా వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ ఉందని, మండలస్థాయి అధికారులు మండలంలోని అన్ని రకాల గురుకుల విద్యాసంస్థలు, వసతి గృహాలను, మోడల్ స్కూల్‌లను విజిట్ చేసి విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, వసతి, ఎడ్యుకేషన్ క్వాలిటీని పరిశీలించాలని సూచించారు. మన ఊరు - మనబడి కార్యక్రమాల ద్వారా చేపట్టిన నిర్మాణ ప్రగతి వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తహసీల్దార్‌లు వివాదాస్పద భూముల వివరాలు, భూరిజిస్ట్రేషన్ల వివరాలు అందించాలని పేర్కొన్నారు. ఈనెల 20న మరొకసారి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌షాలోమ్, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించిన మంత్రి

హుస్నాబాద్ డిపోకు వచ్చిన రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను బుధవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో మహిళల ప్రయాణం పెరిగిందని, మహిళా ప్రయాణికులను గౌరవించాలని సూచించారు.

## రోడ్డు వెడల్పును నిలిపివేయాలి


దుబ్బాకలో ధర్నాలో పాల్గొన్న బాధితులు

దుబ్బాక, జనవరి 10: దుబ్బాక పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మారెమ్మ గడ్డ వరకు రోడ్డు వెడల్పు పనులను వెంటనే నిలిపివేయాలని బుధవారం ఇళ్లను కోల్పోతున్న బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుబ్బాకలో తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తమ ఇళ్లకు మార్కింగ్‌ను వేశారని తెలిపారు. రోడ్డు వెడల్పు చేయడం వల్ల తాము పూర్తిగా కోల్పోవల్సివస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఇళ్లను కోల్పోతున్న బాధితులెవరూ సంతకాలు చేయలేదని, తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## ఆయిల్‌పామ్ సాగుతో అధిక ప్రయోజనం


అయినాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారి పండరి

చేర్యాల, జనవరి 10 : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు తక్కువ పెట్టుబడి, అతితక్కువ శ్రమతో అధిక దిగుబడి, ప్రయోజనం పొందవచ్చని ఉద్యానవన శాఖాధికారి పండరి పేర్కొన్నారు. కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ పంట సాగు పట్ల బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుద్వారా రైతులు 90శాతం సబ్సిడీ పొందుతారని, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ అందుతుందన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు ఎకరాకు రూ.2వేలు, ఉద్యానవన శాఖ ద్వారా రూ.2,200 చొప్పున ప్రభుత్వం రూ.4,200ఖర్చులు అందిస్తుందన్నారు. నాలుగేళ్లకు మొదటి దిగుబడి వస్తుందని, అంతర పంటగా కంది, పత్తి, మక్కజొన్న కూడా సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు వ్యవసాయానికి అనుబంధంగా ఆయిల్‌పామ్ సాగుచేసుకుని లాభం పొందాలని సూచించారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

గజ్వేల్, జనవరి 10: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ తిరుపతి పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు పాఠశాల నుంచి ప్రజ్ఞాపూర్ చౌరస్తా వరకు విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి, చౌరస్తాపై నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ తిరుపతి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయపాల్, కాటరాయప్ప, గజ్వేల్ ఎస్ఐ పరుశరాములు, యాదవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## జక్కాపూర్‌లో ఘనంగా హిందీ దివస్

నారాయణరావుపేట, జనవరి 10: విద్యార్థుల ఉన్నత విద్యకు హిందీ సోపానంలా ఉపయోగపడుతుందని, విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మట్ట మల్లారెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం ప్రపంచ హిందీ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు చేతిరాత, చిత్రలేఖనం వంటి విషయాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనే రోటరీక్లబ్ ధ్యేయం

ములుగు, జనవరి 10: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రోటరీ ఇంటర్నేషనల్ పనిచేస్తుందని రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ పేర్కొన్నారు. బుధవారం ములుగు మండలంలోని తునికి బొల్లారంలో హెల్ప్ టు నీడ్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు. మహిళలకు మూడు కుట్టు మిషన్లు అందించారు. కార్యక్రమంలో హెల్ప్‌టు నీడ్ వ్యవస్థాపకుడు మహేశ్‌రావు, అట్రాక్షన్ మెంబర్ చైర్మన్ కొడాలి చంటి, వాటర్, శానిటేషన్ చైర్మన్ కుంట కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం


గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, జనవరి 9: ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్ సౌకర్యం కల్పించామని, మిగతా ఐదు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేసి తీరుతామన్నారు. వారితో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాయిని యాదిగిరి, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, పట్టణాధ్యక్షుడు మోహన్నగారి మదన్‌మోహన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హనుమాండ్ల నాగరాజు నేత, నాయకులు తదితరులున్నారు.

## వీఆర్‌వో వ్యవస్థను తిరిగి అమలు చేయాలి: డీబీఎఫ్

గజ్వేల్/గజ్వేల్ టౌన్, జనవరి 10: రాష్ట్రంలో గత ప్రభుత్వం రద్దు చేసిన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను తిరిగి అమలు చేయాలని దళిత బహుజనఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అవినీతి పేరుతో వీఆర్వో వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం భూపరిపాలనను విధ్వంసం చేసి పేదలకు భూహక్కులను హరించిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను పటిష్ట పరిచి పేదల భూహక్కుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధానకార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు.

## మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గజ్వేల్, జనవరి 10: గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంతో పాటు గ్రామాల్లో మరిన్ని ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత రెండు నెలలుగా పిల్లలకు వేలిముద్రలు, చిరునామా మార్పులని, గ్యాస్ ఈ-కేవైసీ, రేషన్ ఈ-కేవైసీలు చేపడుతుండడంతో ప్రజలు ఆధార్ కార్డులు పట్టుకుని మున్సిపల్, పోస్టాఫీస్, మీసేవ కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సివస్తున్నదన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మరిన్ని ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

అక్కన్నపేట, జనవరి 10: రోటరీ క్లబ్ ఆఫ్ హన్మకొండ, అంతకపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్సెస్సీ 1985-86 పూర్వ విద్యార్థులు సంయుక్తంగా బుధవారం మండలంలోని అంతకపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినులకు 71 సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రవీంద్రనాథ్, మాజీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సర్పంచులు ముత్యాల సంజీవరెడ్డి, ఇర్రి లావణ్యారాజిరెడ్డి, ఎంపీటీసీ కంది రజితశ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎంలు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.


అంతకపేటలో విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

### నేడు డయల్ యువర్ డీఎం

గజ్వేల్, జనవరి 10: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ బి.సురేఖ తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సేవలు, ప్రయాణికుల సలహాలు, సూచనలు, సమస్యలపై 9959226270 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

### నూతన జాతీయ విద్యావిధానం రద్దుచేయాలి

చేర్యాల, జనవరి 12: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దుచేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి పుల్లని వేణు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ విద్యావిధానం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. ఈ నెల 12న ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మాక్ చేపట్టనున్నామని, విద్యార్థులు తరలిరావాలని కోరారు.

### మల్లన్న ఆలయ మాజీ చైర్మన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, జనవరి 10 : ఇటీవల ప్రమాదానికి గురై గాయాలపాలైన మల్లన్న ఆలయ మాజీ చైర్మన్, పట్టణ బీఆర్ఎస్ నాయకుడు ముస్త్యాల కిష్టయ్యను బుధవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. వెంట మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

### మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

మిరుదొడ్డి, జనవరి 10: దుబ్బాక మున్సిపాలిటి పరిధిలోని చెల్లాపూర్ వార్డులో ఇటీవల కంకనాల కనకయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట కౌన్సిలర్ మల్లారెడ్డి, నాయకులు ఉన్నారు.

### దళిత పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 10: ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న దళిత పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ కోర్ కమిటీ సభ్యులు డప్పు శివరాజ్ డిమాండ్ చేశారు. డప్పు చెప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 29న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన పోరుగర్జన కార్యక్రమం కరపత్రికను సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు.

### నేడు మద్దూరులో కృతజ్ఞత సభ

మద్దూరు, జనవరి 10: నేడు మద్దూరు మండల కేంద్రంలోని తాజ్ గార్డెన్‌లో నిర్వహించే కృతజ్ఞత సభకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రానున్నట్టు మద్దూరు, దూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మేక సంతోష్, మంద యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేగా మొదటిసారి మద్దూరు మండలానికి వస్తున్నందున సభకు ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

### 12న చేర్యాలలో రక్తదానశిబిరం

చేర్యాల, జనవరి 12: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న చేర్యాల పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వివేకానంద టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. సురేందర్‌రెడ్డి, కార్యదర్శి మలిపెద్ది బాలభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, యువత అధికసంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## గత సంక్షేమ పథకాలను కొనసాగించాలి

- సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూరు, జనవరి 10: గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పేర్కొన్నారు. బుధవారం చిన్నకోడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలు శాఖల పై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామన్నారు. రైతాంగానికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లుగానే ఎరువులు, నీటిని, విద్యుత్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో అందించాలన్నారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేసి, యాసంగి పంటకు నీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు.ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని సభ్యులు చేసిన తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ వనిత, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం, డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ రామచంద్రం, ఎంపీడీవో శ్రీనివాస్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కొమురవెల్లి కస్తూర్బాలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

చేర్యాల, జనవరి 12: కొమురవెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి నీరజ, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి రంగురంగుల ముగ్గులు వేశారు. సంప్రదాయబద్ధంగా భోగిమంటలు వేశారు. హరిదాసు వేషధారణలో ఓ చిన్నారి ఆకట్టుకున్నది.


కస్తూర్బా పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నదృశ్యం

## సింగరాళ్ల మల్లన్న జాతరకు వేళాయె


ఆలయంలో కొలువుదీరిన సింగరాళ్ల మల్లన్న

తొగుట, జనవరి 10: తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లి గ్రామంలో భక్తుల కొంగు బంగారమై వెలసిన సింగరాళ్ల మల్లన్న జాతరను ఈ నెల 14న ఆలయం వద్ద ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సింగరాళ్ల మల్లన్న ఆలయం ప్రధానద్వారం వద్ద రాతికడప ఉండటం మూలంగా ఇప్పటివరకు ఎన్నడూ ఈప్రాంతంలో రాళ్ల వర్షం పడలేదని గ్రామస్థుల విశ్వాసం. అలాగే ఆలయం వెనకాల నీటిగుండంలో గండు కరువులో కూడా నీళ్లు బయటం రావడం గమనార్హం. కాగా జాతర సందర్భంగా ఎండ్లబండ్లను, ట్రాక్టర్‌లను అందంగా అలంకరించి ఆలయం చుట్టూరా తిప్పడంతో పాటు, స్వామి వారికి బోనాలు తీయడం ఆనవాయితీగా వస్తున్నది. జాతర చూడటానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరు కానున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కల్గకుండా గ్రామ సర్పంచ్ చిలివేరి జ్యోతి మల్లారెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## రూ. కోటి అవినీతిపై విచారణ జరిపించాలి

- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి


దుబ్బాకలో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 10: దుబ్బాక ప్రాథమిక సహకార సంఘంలో దాదాపు రూ. కోటికి పైగా అవినీతి జరిగిందని, దానిపై విచారణ జరిపించడంలో అధికారులు విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం దుబ్బాకలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దుబ్బాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్‌తో పాటు సీఈవోలు రూ. కోటి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. సాక్షాత్తు దుబ్బాక ఎమ్మెల్యే కేపీఆర్ అనుచరుడు అవినీతి చేసినా, గోవా టూర్లతో క్యాంపు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. నియోజకవర్గంలో కొన్ని ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, వాటిని కూడా బయటపెడతామని తెలిపారు. దుబ్బాక పీఏసీఎస్‌లో అవినీతికి పాల్పడిన చైర్మన్, సీఈవోల నుంచి డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట సర్పంచు ఎనగంటి కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంతుల శ్రీనివాస్, ఏసురెడ్డి, కొంగరి రవి, మల్లేశం, పరశురాములు, కిషన్‌రెడ్డి, దత్తం స్వామి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

## దళిత ద్రోహులకు ఎమ్మెల్యే అండ సరికాదు

మద్దూరు, జనవరి 10: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో దళితబంధు ఇప్పిస్తానని చెప్పి దళితుల నుంచి డబ్బు వసూలు చేసిన వారికి జనగామ ఎమ్మెల్యే అండగా నిలుస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు గద్దల మహేందర్ ఆరోపించారు. ఈ విషయమై బుధవారం దూళిమిట్ట మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. గతంలో దళితుల ఆర్థికాభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ దళితబంధు అమలు చేశారని, అయితే దళితబంధు ఇప్పిస్తానని చెప్పి మాజీ ఎమ్మెల్యే అండతో వసూలు చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే దళితులకు అన్యాయం జరుగుతున్నా వారి పక్షాన నిలబడకుండా ద్రోహుల పక్షాన నిలబడుతున్నారని ఆరోపించారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద పుస్తెల తాళ్లు కుదవపెట్టి, అప్పులు చేసి ఇచ్చారని, తీసుకున్న డబ్బుల్ని తిరిగి ఇప్పించకపోవడం దళితులకు అన్యాయం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. తీసుకున్న డబ్బుల్ని మోసపోయిన వారికి ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కనకరాములు, తుషాలపురం రాజు, చెన్నోజు రాజు, బ్రహ్మం, రమేష్, సిద్దులు, రాజు, రాజయ్య ఉన్నారు.


దూళిమిట్టలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, దళితులు

## చేర్యాల మాజీ జడ్పీటీసీకి మాతృవియోగం

- పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి


అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 10 : చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు మాతృవియోగం పొందారు. ఆయన తల్లి కొమ్ము లక్ష్మి(65) మంగళవారం రాత్రి అస్వస్థతతో మృతి చెందింది. ఈ మేరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ సిద్దిపేట జడ్పీఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి, చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె అశోక్, కౌన్సిలర్లు ముస్త్యాల తార, చెవిటి లింగం, నాయకులు ఊట్లపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి గోనె హరి తదితరులు సంతాపం వ్యక్తంచేస్తూ కుటుంబసభ్యులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## దళిత బంధు పథకాన్ని కొనసాగించాలి


కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న డీడబ్ల్యూజేఎస్ ప్రతినిధులు

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 10: దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని కొనసాగించాలని దళిత వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జంగం రాజలింగం పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రంలోనీ దళితుల ఎదుగుదల కోసం దళిత బంధు ప్రవేశపెట్టిందని, సీఎం రేవంత్‌రెడ్డి దళితబంధు పథకాన్ని కొనసాగిస్తారని ఆశిస్తున్నట్లు వారు తెలిపారు. రెండో దశలో అమలైన వారికి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. పథకాన్ని కొనసాగిస్తూ దళిత జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మంద జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ


కాషాయం జెండాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గజ్వేల్ రూరల్,జనవరి10. ఈ నెల 22న నిర్వహించనున్న అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో బుధవారం గజ్వేల్‌లో అయోధ్య ట్రస్టు జిల్లా అధ్యక్షుడు, సామాజిక సమరత రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ బాబు, శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు రామకోటి రామరాజు ఆధ్వర్యంలో స్థానిక శ్రీమురళీకృష్ణ ఆలయంలో కాషాయ జెండాలు, అక్షింతలకు పూజలు చేసి, ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రామచంద్రం, సభ్యులు ఉప్పల వెంకటేశం, మైత్రాములు, లక్ష్మయ్య, శివకుమార్, బండి శ్రీనివాసు, ధార రాంచంద్రం, ఉప్పల మధు, దశరథం తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం


చేర్యాల: క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి

చేర్యాల, జనవరి 10: క్రీడలు మానసికోల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపతాయని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చేర్యాల పట్టణంలో స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందింపజేస్తాయన్నారు. గెలుపోటములు సహజమని, పోటీలను సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు కోణం నర్సింహులు, బుట్టి హరీశ్, బుచ్చిరాములు, పరూక్, ఆనంద్ పాల్గొన్నారు.

### నంగునూరులో...

నంగునూరు, జనవరి 10: క్రీడలు శారీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంగునూరులో ఎన్‌సీసీ, టీహెచ్‌ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి క్రీడలు దోహద పడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, మండల కో ఆప్షన్ సభ్యులు రహీం పాషా, ఆర్గనైజర్స్ కోల శ్రవణ్ గౌడ్, గిరిబాబు, పవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

### గాగిల్లాపూర్‌లో డివిజన్‌స్థాయి పోటీలు


నంగునూరులో టీహెచ్‌ఆర్ క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి

మద్దూరు, జనవరి 10: మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో డివిజన్‌స్థాయి క్రికెట్‌పోటీలను బుధవారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్ స్థానిక సర్పంచ్ బొల్లు కృష్ణవేణిచంద్రమౌళితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ పోతారం, గాగిల్లాపూర్ జట్ల మధ్య మొదటి మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. సంక్రాంతి వరకు కొనసాగే ఈ క్రీడోత్సవాల్లో మొత్తం 15 టీంలు పాల్గొంటున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.15వేలతో పాటు షీల్డు, ద్వితీయ బహుమతి రూ.10 వేలతో పాటు షీల్డు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేక ఉమామహేశ్వర్, ఉపసర్పంచ్ మేక గోపాల్, గాగిల్లాపూర్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.